డిస్పెన్సరీ ఏర్పాటుకు కృషి చేయండి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీని ఆరు పడకల ఆస్పత్రిగా గతంలో కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ శంకుస్థాపన చేశారని.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్మించుకోలేకపోయామని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరేష్ అన్నారు. పనులు ప్రారంభించి పూర్తి చేసే విధంగా చూడాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగసాని నరేష్ కుమార్, సీనియర్ నాయకులు నాగసాని తులసిదాస్, న్యాయవాది నాగసాని నవీన్‌రాజ్ ముదిరాజ్ ఎంపీని సన్మానించారు.

మేధావిని కోల్పోయాం



ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దేశం సీతారాం ఏచూరి లాంటి మేధావిని కోల్పోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య తెలిపారు. ఆదివారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో బెల్ సీపీఎం శాఖ కార్యదర్శి రామారావు ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, వెంకటేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులతో మెట్టు శ్రీధర్

పటాన్ చెరు టౌన్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సంస్థ జిల్లా అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ ఆకాంక్షించారు. ఆదివారం డివిజన్ అంబేడ్కర్ కాలనీలోని బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. హాస్టల్‌లో వసతులపై ఆరా తీశారు. అనంతరం వారికి పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.



రాయదుర్గంలో మాజీ కార్పొరేటర్ కోమిరిశెట్టి సాయిబాబా



మక్తా మహబూబ్‌పేట్ గణేషుడి ఉత్సవాల్లో..



బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్

జైజై గణేశ.. జయములిమ్ము గణేశా

భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు

శేరిలింగంపల్లి జోన్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం వాడవాడలా 'జై గణేశ్.....జై జై గణేశ్ ' నినాదాలతో మార్మోగిపోతోంది. జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్‌లలోని కాలనీలు, బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో ప్రతిష్ఠించిన గణనాథులకు ప్రత్యేకపూజలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. పలుచోట్ల మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, ఇతర నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తూ.. అందరూ ఉత్సాహంగా వేడుకలను నిర్వహించుకున్నారు. అనంతరం పోటాపోటీగా లడ్డూవేలం పాటలు నిర్వహిస్తున్నారు. పలు చోట్ల ఆదివారం కావడంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టారు.

– శేరిలింగంపల్లి జోన్ బృందం



కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు



చందానగర్‌లో కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి



గచ్చిబౌలి నాగార్జున రెసిడెన్సీలో..



మధురానగర్‌లో ఉచిత కంటి పరీక్షలు..



గోపన్‌పల్లిలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



గోపన్‌పల్లిలో గణపయ్యకు హారతి ఇస్తున్న జగదీశ్వర్‌గౌడ్



ప్రత్యేక అలంకరణలో గణనాథుడు



కొండాపూర్‌లో స్థానిక మహిళలు



కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్‌లో కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్

20న 'టెక్‌ఫార్వర్డ్' సిరీస్ సెమినార్

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'టెక్ ఫార్వర్డ్' పేరిట రీసెర్చ్ సెమినార్ సిరీస్‌లో భాగంగా ఈనెల 20న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నగర శివారులోని గోల్డ్ మ్యాన్‌సాక్స్ సంస్థ ప్రాంగణంలో ఈ సమావేశం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తారు. 'టెక్నాలజీ ట్రాన్స్‌ఫార్మింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్' అనే అంశంపై ఈ సమావేశం జరగనుంది.

ఉత్సాహంగా 5కె రన్



గచ్చిబౌలి స్టేడియంలో 5కె రన్‌లో పాల్గొన్న రన్నర్లు

గచ్చిబౌలి: పరుగు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని యశోదా హస్పిటల్ ఆర్థోపెడిక్ జాయింట్ రిప్లేస్‌మెంట్ డాక్టర్ జయకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ ఉత్సవ్‌లో భాగంగా సైంట్, యశోదా ఆసుపత్రి సంయుక్తంగా 5కె రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాయామం జీవనశైలిలో భాగం కావాలన్నారు. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ వాకింగ్, జాగింగ్ చేయాలని ఆయన సూచించారు. ఐటీ ఉద్యోగులు, డాక్టర్లు, రన్నర్లు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులను పూర్తి చేయండి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ వాసులు

గచ్చిబౌలి: శిల్పాగార్డెన్ ప్రాంతంలో సీసీరోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతూ శిల్పాగార్డెన్ వెల్ఫేర్ అసోసియేషన్‌వాసులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీకి వినతిపత్రం అందజేశారు. పలు కాలనీల్లో సీసీరోడ్డు పనులు పూర్తిచేస్తే ప్రజా సమస్యలు తీరుతాయన్నారు. కొన్నిచోట్ల మిగిలిన చోట పనులు పూర్తి చేస్తే రాకపోకలకు అనువుగా మారుతుందని, స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన శిల్పా గార్డెన్‌లో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు అన్ని రకాల చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

ప్రమాణ స్వీకారానికి తరలిన కాంగ్రెస్ నేతలు



నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, నాయకులు

చందానగర్: తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు భారీగా ర్యాలీగా తరలివెళ్లారు. మొదట గన్‌పార్కు చేరుకుని అమరుల స్థూపానికి నివాళులర్పించి అనంతరం పీసీసీ అధ్యక్ష ప్రమాణ స్వీకార మహోత్సవానికి వెళ్లారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి

- మానవ మేధస్సుకే సవాలు విసురుతున్న ఇంజినీర్లు
- 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న డైరెక్టర్

రాయదుర్గం: ప్రపంచంలోని అద్భుతాలన్నీ ఇంజినీరింగ్ టెక్నాలజీతోనే సాధించిన విజయాలని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' ప్రాంగణంలో ప్రముఖ ఇంజినీర్ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి డాక్టర్ రామేశ్వరరావు, అధికారులు, ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. చరిత్ర ప్రారంభంతోనే ఇంజినీరింగ్ టెక్నాలజీ కూడా ప్రాణం పోసుకుందని, భవిష్యత్తులో ఇంజినీరింగ్ విద్య మానవ మేధస్సుని ఛాలెంజ్ చేసే విధంగా రూపుదిద్దుకుంటుందని అభిప్రాయపడ్డారు. ఇంజినీరింగ్ విద్యలో సుమారు 15 విభాగాలు పనిచేస్తున్నాయని, స్పేస్ టెక్నాలజీ, సివిల్, మెకానికల్, కెమికల్, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ తదితర విభాగాల ద్వారా ప్రపంచం మొత్తంలో ఇంజనీరింగ్ పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తుండటంతో ప్రపంచం ఈ రోజు ఒక అద్భుతమైన ప్రగతి సాధించిందన్నారు, భవిష్యత్తులో ఈ వేగం మరింత పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా 1981లో నగరంలోని గచ్చిబౌలి ప్రాంతంలో ఏర్పాటు చేశారన్నారు. డాక్టర్ కృష్ణప్రసాద్‌రావు, డా. విద్యాసాగర్, డా. ప్రశాంత్, డా. జగన్‌మోహన్‌రెడ్డి, డా., శ్రీధర్, డా.ఆదినారాయణ, చంద్రకళ, లక్ష్మీకాంతరావు, పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన





మాదాపూర్ శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

మాదాపూర్: చిన్నారి కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం శ్రీ మానస స్కూల్ ఆఫ్ కూచిపూడి డాన్స్ అకాడమీ గురువు ప్రణవి తుమ్మటి శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు. అంబ పరాకు, వినాయకకౌతం, మూషికవాహన, రామదాసు కీర్తన, గరుడ గమన, మరకత మణిమయ తదితర అంశాలను కళాకారులు కీర్తన, సహస్ర, శాన్వి, శిరీష, అనన్య, యుక్త, దివిజశ్రీ, అవంతిక, హిమవర్షిత, విద్య, దీక్షిత, ప్రణతిశ్రీ, పూర్వి, మోక్షిత, లక్ష్మీదేవాంషిత తదితరులు పాల్గొని ప్రదర్శించారు.

కాంగ్రెస్‌తోనే బీసీలకు సమన్యాయం

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



ర్యాలీలో నీలం మధు ముదిరాజ్, నాయకులు

పటాన్‌చెరు: నూతన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. మహేష్‌గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా అసెంబ్లీ గన్‌పార్క్ నుంచి గాంధీభవన్ వరకు జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా నీలం మధు మాట్లాడుతూ... బీసీ బిడ్డకు పెద్ద పీట వేసిని కాంగ్రెస్ అధినాయకత్వానికి రుణపడి ఉంటామన్నారు. అన్నివర్గాలకు సమ ప్రాధాన్యతనిస్తూ ఓట్లతో పాటు రాజకీయ అధికారం సైతం అప్పగిస్తూ అన్ని వర్గాలను ప్రోత్సహిస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని కొనియాడారు. బీసీ కులగణనను త్వరలో ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ మంత్రులకు ముఖ్య నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

అత్తాపూర్: డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించగా, డివిజన్ సభ్యత్వం ఇంచార్జ్ నందకిషోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో కనీసం 30 వేల మంది సభ్యులను చేయడమే మా లక్ష్యమని అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం హైదర్‌గూడ వై–జంక్షన్ వద్ద నుంచి ప్రారంభించడం జరిగిందని, ప్రతి కార్యకర్త కనీసం 100 మందితో సభ్యత్వం చేయించాలని కోరారు. ప్రతీ ఇంటి నుంచి ఒక బీజేపీ కార్యకర్తలను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడం మల్లారెడ్డి, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్, జిల్లా సభ్యత్వ కో–కన్వీనర్ కొమురయ్య, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, సుధాకర్, శ్రీధర్ తదితరులున్నారు. బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఊరపోచమ్మకు ప్రత్యేక పూజలు



రాయదుర్గం: రాయదుర్గంలోని ఊరపోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారం చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పించారు. ఆదివారం నిర్వహించే పూజల్లో స్థానికులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.6 లక్షలు పలికిన లడ్డూ..



రుద్రరాజు సూర్యనారాయణ రాజుకు లడ్డూను అందజేస్తున్న సొసైటీ సభ్యులు

చందానగర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీనగర్ కాలనీలోని వినాయకుడి లడ్డూ రూ.6,40,000లు పలికింది. గణనాథుడి లడ్డూ వేలంలో రుద్రరాజు సూర్యనారాయణ రాజు గణనాథుడి లడ్డూను వేలంపాటలో కైవసం చేసుకున్నారు. కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆయనకు ప్రసాదాన్ని అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

పటాన్‌చెరు టౌన్: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ వాడకం తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పర్యావరణ వేత్త డాక్టర్ కిషన్ రావు స్మారక కమిటీ, కాలుష్య నివారణ సంఘర్షణ సమితి ఏర్పాటుచేసిన సంస్మరణ సభ కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ప్రముఖ పర్యావరణవేత్త, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, తెలంగాణ ప్రాంత సహా సద్భావ ప్రముఖ్ రామకృష్ణ, గోశాల చైర్మన్ దుర్గాప్రసాద్, పర్యావరణ వేత్త ప్రొఫెసర్ నరసింహారెడ్డి, మాజీ ఆర్టీఐ కమిషన్ సభ్యులు దీపక్ రెడ్డి, నరేందర్ రెడ్డి, గోదావరి ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు రోటరీ క్లబ్ రూ.10 లక్షలు అందజేత

రాజేంద్రనగర్: ప్రభుత్వ పాఠశాలకు రోటరీ క్లబ్, మానవియా డెవలప్‌మెంట్ ఫౌండేషన్ అండ్ ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్ (హైదరాబాద్), రోటరీ క్లబ్ సంయుక్తంగా రూ.10 లక్షలతో బాలికలు, బాలురలకు విడివిడిగా 9 టాయిలెట్స్, 9 వాటర్ సంప్ (10 వేల లీటర్లు), అసెంబ్లీ షెడ్, 2000 లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి మేనేజింగ్ డైరెక్టర్ గౌరీశంకర్ చేతుల మీదుగా పాఠశాల యజమాన్యానికి అందించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. రామ్‌ప్రసాద్, శ్రీనివాస బాబు, సెక్రటరీ జగదీశ్వర్, రోటరీ క్లబ్ డెక్కన్ ప్రెసిడెంట్ జస్సీ, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భవిష్యత్తులో మరిన్ని వసతులైన గ్రిల్స్, దృశ్య శ్రావణ సామగ్రిని బహుకరించాలని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరో ఐదుగురికి గాయాలు



రత్నాబాయి (ఫైల్)

గచ్చిబౌలి: స్కూటీని తప్పించబోయి ఆటో అదుపు తప్పిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్. వెంకన్న తెలిపిన ప్రకారం.. చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన రత్నాబాయి(38), తులసీరాం(48) కుమార్తె దుర్గేశ్వరీ(25)తో కలిసి ఫిలింనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆటోలు గచ్చిబౌలి వెళ్లేందుకు బయలుదేరారు. షేక్‌పేట్ ఫ్లైఓవర్ పైనుంచి వస్తుండగా.. మల్కంచెరువు వద్ద స్కూటీని ఢీ కొడుతూనే.. రోడ్డు వెంట పార్క్ చేసిన కారును ఢీకొట్టి ఆటో పల్టీ కొట్టింది. దీంతో రత్నాబాయికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో నడుపుతున్న తలసీరాం, కుమార్తె దుర్గేశ్వరీ, చంద్రకళకు తీవ్ర గాయాలయ్యాయి. స్కూటీ నడుతున్న షకీల్, అతడి భార్య పర్వీన్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలు రత్నాబాయి పీడబ్ల్యూసీ కంపెనీలో హౌస్ కీపింగ్ పనులు చేస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మియాపూర్: భార్యభర్తల గొడవతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ దుర్గా రామలింగప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామానికి చెందిన ఎస్‌కె. రఫీ(29) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆరేళ్ల క్రితం శ్రావణిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. గత కొద్ది రోజులుగా రఫీ మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవపడుతుండేవాడు. భార్య వేధింపులు తట్టుకోలేక గతేడాది సొంతగ్రామంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కౌన్సెలింగ్‌లో మంచిగా ఉంటానని చెప్పాడు. తదానంతరం హైదరాబాద్‌లో ఓ సూపర్ మార్కెట్‌లో పని చేస్తూనే తిరిగి వేధింపులు ప్రారంభించాడు. వేధింపులు తళలేక భార్య ఉమెన్స్ హాస్టల్‌లో ఉంటూ అరబిందో ఫార్మా కంపెనీలో పనిచేస్తుంది. భార్యభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో రఫీ 14న రాత్రి సమయంలో హాస్టల్‌కి వచ్చి గొడవకు దిగాడు. భార్య భయంతో హాస్టల్‌లోకి వెళ్లిపోయింది. కొద్దిసేపటి వరకు రఫీ అక్కడే ఉండి బయటకు వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం మియాపూర్ బీకేఎన్‌క్లేవ్ సమీపంలోని ఓ చెట్టుకు వైర్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు చూసి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, భార్యకు సమాచారం ఇచ్చారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నర్సింగ్‌గౌడ్ సోదరి ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ వైద్యులు ఆసుపత్రులు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలి



వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భారతీనగర్, రామచంద్రపురం, అమీన్‌పూర్ మున్సిపాలిటీ, పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన వివిధ వినాయక మండపాలను ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐసీసీ లేబర్ సెల్ చైర్మన్‌కు సన్మానం

మూసాపేట: ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, ఏఐసీసీ లేబర్ సెల్ చైర్మన్ డా. జి. సంజీవరెడ్డిని ఆదివారం టీపీసీసీ లేబర్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సప్పిడి భాస్కర్ సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ ఆర్ ప్రకాష్ గౌడ్, ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగళ్ల సత్యజిత్, కార్మిక నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీధర్ గౌడ్, ఆర్. సుజిత్ గాంధీ పాల్గొన్నారు.

ఉచిత ప్రమాద బీమా ఇవ్వటం హర్షణీయం

పటాన్‌చెరు: ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ. ఐదు లక్షల ఉచిత ప్రమాద బీమా అందజేస్తామని చెప్పడం హర్షణీయమని ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, గౌరవ అధ్యక్షుడు జగన్మోహన్ రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సలహాదారులు యాదగిరి శేఖర్ రావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.